క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: వసంతపురి సబ్‌స్టేషన్ 11కేవీ సాయిరాం ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా యాదవనగర్, మధుసూదన్‌నగర్, సంజయ్‌నగర్, ఓల్డ్ మల్కాజిగిరి, గీతానగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 7 గంటలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుదీప్‌రెడ్డి తెలిపారు. 11కేవీ బీజేఆర్‌నగర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 7 గంటల వరకు షావాలీస్ లేన్, వెంకటేశ్వరనగర్, పోస్టాఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గిరిజన గురుకులంలో స్పాట్ అడ్మిషన్స్

మేడిపల్లి: ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరేందుకు అవకాశం ఉందని జంగంమెట్ గురుకుల ప్రిన్సిపాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జంగంమెట్ గిరిజన గురుకుల సంక్షేమ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ నెల 24న జంగంమెట్ గిరిజన గురుకుల కళాశాలలో విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బోడుప్పల్‌లో నిర్వహిస్తున్న జంగంమెట్ గిరిజన గురుకుల సంక్షేమ కళాశాలలో ఇంటర్ చదివేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు 2023–23లో పదవ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తామన్నారు. పదో తరగతి మెమో, ఒరిజనల్ టీసీ, బోనఫైడ్, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. స్పాట్ అడ్మిషన్స్ మెరిట్ ప్రకారం ఉంటాయన్నారు. వివరాలకు ఫోన్: 83339 25387.

శ్మశానవాటికల కోసం స్థలం కేటాయించాలి



తహసీల్దార్‌తో సాయిజెన్‌శేఖర్ తదితరులు

మల్లాపూర్: నాచారం హెచ్ఎంటీ నగర్ పక్కన ఇందిరానగర్‌లో ప్రభుత్వ స్థలంలో హిందువులు, ముస్లిం, క్రైస్తవులకు శ్మశానవాటిక కోసం స్థలాన్ని కేటాయించాలని కోరుతూ మంగళవారం ఉప్పల్ తహసీల్దార్ వెంకట నరసింహరెడ్డికి బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయిజెన్‌శేఖర్ వినతి పత్రం అందజేశారు. జాకీర్ హుస్సేన్, కోరపాక అంజి, షేక్ రఫీక్, ఖాజా, ఖాదర్, కట్ట బుచ్చన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి జయంతి

మల్లాపూర్: సమర్థ పాలకుడు సంఘ సంస్కర్త రాజా బహదూర్ కొత్వాల్ వెంకట్రామారెడ్డి అని పలువురు మల్లాపూర్ రెడ్డి సంఘం ప్రతినిధులు కొనియాడారు. మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ చౌరస్తాలో మల్లాపూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం ప్రతినిధులు దోమ శ్రీనివాస్‌రెడ్డి, కోదండ ధర్మారెడ్డి, కృష్ణారెడ్డి, పద్మారెడ్డి, ముత్యంరెడ్డి, దయాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రవణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

25 నుంచి లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరిస్తూ..

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాలు 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు విలేకరుల సమావేశంలో తెలిపారు. 25వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, విశ్వక్సేన ఆరాధన, 26వ తేదీన ధ్వజారోహనం, 27వ తేదీ శ్రీనివాస కల్యాణం, 28వ తేదీన సుదర్శన హోమం, పుష్పయాగం, 29న బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు. సమావేశంలో క్లర్క్ సుధాకర్, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్లు ఉమేష్‌సింగ్, రాందాస్ సంతోష్, మాజీ ధర్మకర్తలు గణేష్, రవీందర్, ఆలాపన పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బుధవారం మంత్రి మల్లారెడ్డి పర్యటించనున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధి అర్కల్‌గూడ, సుతారిగూడలో పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.

గోప్యంపై గరం.. గరం

మైనార్టీ, బీసీ, దళిత బంధు లబ్ధిదారుల ఎంపికపై స్పష్టత కరువు

- అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై సభ్యుల రసాభాస
- అక్రమ కట్టడాలు, కూల్చివేతలు, వేధింపులు, ఇంటి నంబర్లపై ఆగ్రహం
- జిల్లా పరిషత్ సభలో వాడీవేడీ చర్చ

సాక్షి, మేడ్చల్ జిల్లా: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో భాగంగా అర్హులైన లబ్ధిదారుల ఎంపిక గోప్యతపై పలువురు సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత, మైనార్టీ, బీసీ బంధు పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కొందరి ప్రజాప్రతినిధుల ఒత్తిడి, సిఫారసుల మేరకే సాగుతుందని ఆరోపించారు. మంగళవారం మేడ్చల్‌లోని జిల్లా పరిషత్ హాలులో చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. సభలో మంత్రి చామకూర మల్లారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీ) అభిషేక్ ఆగస్త్య, జెడ్పీ సీఈఓ దేవసహాయం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సభలో ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ దళిత బంధు లబ్ధిదారుల ఎంపికలో దళారుల ప్రమేయం ఉంటోందని, కొందరు దళారులు దళిత బంధు ఇప్పిస్తామని దరఖాస్తులు తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో మంత్రి, ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నేతలు సిఫారసు చేసిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. మైనార్టీ బంధు ఎంపిక గోప్యంపై ఎంపీపీ రజిత తీవ్రంగా ధ్వజమెత్తారు. ఏ పద్ధతిన ఎంపిక చేశారో తెలపాలని పట్టుబట్టారు. బీసీ బంధు లబ్ధిదారుల ఎంపికలో కూడా గందరగోళం నెలకొందని పలువురు సభ్యులు విమర్శించారు. ఈ విషయమై జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ పథకాల్లో లబ్ధిదారుల ఎంపికపై ప్రభుత్వం జారీ చేసిన మార్గకాలను సభ్యులకు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జెడ్పీ వైస్ చైర్మన్ బేస్త వెంకటేశం, పలువురి అధికార పార్టీ సభ్యులు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఈ విషయంలో చైర్మన్ జోక్యంతో వివాదం సద్దుమణిగింది.

అక్రమ కట్టడాలపై..

పురపాలక సంఘానికి సమీపంలో ఉన్న చీర్యాల, కీసర, గోధుమకుంట గ్రామాల్లో అక్రమంగా నిర్మించుకున్న పేదల ఇళ్లను పెనాల్టీతో రెగ్యులరైజ్ చేసి, ఇంటి నంబర్లు కేటాయించాలని జెడ్పీ వైస్ చైర్మన్ బేస్త వెంకటేశం సభలో కోరారు. మరో సభ్యురాలు ఎల్లుబాయి మాట్లాడుతూ పేదల ఇళ్లు కూల్చివేస్తున్న అధికారులు బడాబాబుల జోలికి వెళ్లడం లేదని, బొమ్మరాసుపేటలో కొనసాగుతున్న అక్రమ కట్టడాలను ప్రస్తావించారు. ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఏదులాబాద్‌లో ప్రజల నుంచి వసూలు చేసిన రూ.50 లక్షల పన్నులు దర్వినియోగమైనా.. చర్యలు తీసుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, జోరుగా సాగుతున్న అక్రమ కట్టడాలను అరికట్టలేకపోతున్నారని, దీనికి ప్రధానం కారణం అవినీతి, అక్రమాలేనని ఆరోపించారు. ఈ విషయంపై చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ పేదలు నిర్మించుకున్న ఇళ్లను రెగ్యులరైజ్ చేయడంపై ఒక కమిటీని వేసి.. తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. అక్రమ కట్టడాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సభ్యురాలు శైలజ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా గ్రంథాలయాల భవనాల నిర్మాణం, రీడింగ్ రూమ్‌లను రూ.4 కోట్లతో చేపట్టామని, మరో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి వివరించారు.





సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య తదితరులు

ప్రజల సంక్షేమానికి నిరంతరం పని చేస్తున్నాం

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: పేదల సంక్షేమం, అభ్యున్నతికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి ఆర్థిక అభివృద్ధికి పరితపిస్తుంటారని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న కార్యక్రమాలను దేశంలో ప్రవేశపెడుతున్నారని, ఇది ఎంతో గర్వించదగిన విషయం అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈవో) దేవసహాయం, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న సమావేశంలో మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే నిరుపేదలకు గృహలక్ష్మీ పథకం కింద రూ.3 లక్షల ఆర్థిక సాయం



ప్రభుత్వం అందిస్తోందన్నారు. జిల్లాలో ఈ నెల 26 వరకు ప్రతి నియోజకవర్గంలో మూడు వేల మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.3 లక్షలకు సంబంధించిన గృహలక్ష్మీ చెక్కులను అందజేస్తామని తెలిపారు. రెండో విడతలో కూడా ప్రతి నియోజకవర్గంలో 3 వేల మందికి గృహలక్ష్మీ పథకం వర్తింపజేస్తామన్నారు. దళితబంధు పథకం రెండో విడతలో ప్రతి నియోజకవర్గంలో 1,100 మంది చొప్పున అర్హులైన వారికి లబ్ధి కల్పిస్తామన్నారు. బీసీ, మైనారిటీ బంధు కింద రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు.

అభివృద్ధి ఘనత మాదే: జెడ్పీ చైర్మన్

పల్లెలు, పట్టణాల్లో పరిశుభ్రత, పచ్చదనం, పార్కులు, రోడ్లు వంటి అభివృద్ధి పనుల ఘనత తమ ప్రభుత్వానిదేనని, ఇదంతా సీఎం కేసీఆర్ తోనే సాధ్యమైందని జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల కృషి, సమన్వయం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ బేస్త వెంకటేశం, సభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఇందిర, ఎల్లుబాయి, రజిత, శైలజ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, ఓడీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన బీఎల్ఆర్



కాప్రా: బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గం అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, బన్నాల గీతప్రవీణ్‌ముదిరాజ్, శాంతిసాయిజెన్‌శేఖర్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సాయిజెన్‌శేఖర్, ప్రవీణ్‌ముదిరాజ్ ఉన్నారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించండి

అల్వాల్: తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవడానికి ప్రజలంతా ఏకం కావాలని కాంగ్రెస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. మంగళవారం సాయంత్రం వినాయక్‌నగర్ డివిజన్‌లోని కాకతీయనగర్ గౌరీ శంకర్ అపార్ట్‌మెంట్ నుంచి వివిధ కాలనీల్లో కాలనీ నేస్తం- కాంగ్రెస్ హస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను అందజేశారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని, కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, గుత్తి రాంచందర్, ఎమ్మార్ శ్రీనివాస్‌యాదవ్, గిరి యాదవ్, బాలకృష్ణ, ఆశ, కీర్తి, గణేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి అసెంబ్లీ సీటు కేటాయించాలి

రానున్న ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున తనకు కాంగ్రెస్ టికెట్ కేటాయించాలని కోరుతూ మంగళవారం నగరంలోని గాంధీ భవన్‌లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ దరఖాస్తును సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా కాంగ్రెస్‌లో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో మల్కాజిగిరి అసెంబ్లీ సీటును కేటాయించాలని ఆయన కోరారు.



గాంధీ భవన్‌లో దరఖాస్తులను అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



కాకతీయనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

సీఎం కేసీఆర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కాప్రా: అధికారంలోకి వచ్చిన వెంటనే జీహెచ్ఎంసీ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేసిన సీఎం కేసీఆర్‌పై కేసు నమోదు చేయాలని కోరుతూ వందలాది మంది కార్మికులు, ఏఎస్‌రావునగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డి, కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ కాప్రా సర్కిల్ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా మంగళవారం కాప్రా సర్కిల్ కార్యాలయం నుంచి కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న జీహెచ్ఎంసీ కార్మికులు, కాంగ్రెస్ నాయకులు

డ్రగ్స్‌తో భవిష్యత్ నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న మల్కాజిగిరి డీసీపీ జానకి ధరావత్

మేడిపల్లి: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం షీటీం బృందాలు, డ్రగ్స్, ట్రాఫిక్, సైబర్ క్రైమ్ తదితర వాటిపై మేకల కమలబాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్లో వివిధ కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్కాజిగిరి డీసీపీ జానకి ధరావత్ మాట్లాడుతూ.. విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, వాటికి దగ్గరై భవిష్యత్ నాశనం చేసుకోవద్దని, చట్టాలు కఠినంగా ఉన్నాయని జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. మల్కాజ్‌గిరి ఏసీపీ నరేష్‌రెడ్డి, సీఐ గోవర్ధనగిరి, ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ జోసెఫ్, కృష్ణంరాజు, మేడిపల్లి డీఐ రాము, షీటీం ఎస్సై కమల పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కాప్రా: జమ్మిగడ్డ భగత్‌నగర్ కాలనీకి చెందిన తాపీ మేస్త్రీ రాంబాబు భార్య కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. మధుర చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రాగిడి లక్ష్మారెడ్డి మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. పాకలి రాజన్న, భరత్‌నగర్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్, ఆనంద్‌చారి, సింగం కిరణ్, యాకయ్య, నర్సింహ, రాములు, రమేష్‌చారి, కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, రాఘవరెడ్డి, పత్తి కుమార్, సందీప్‌గౌడ్, సాయిగౌడ్ ఉన్నారు.

శుభాకాంక్షలు



మంత్రి మల్లారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: మంత్రి చామకూర మల్లారెడ్డికి రెండోసారి టికెట్ కేటాయించడంతో మంగళవారం మేడిపల్లిలో సంబరాలు చేసుకున్నారు. అనంతరం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల ముసాయిదా విడుదల



ఓటరు జాబితా ముసాయిదా విడుదల చేస్తున్న అధికారి రాజు

మల్కాజిగిరి: మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఓటర్ల ముసాయిదా జాబితాను మంగళవారం ఓటరు నమోదు అధికారి రాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో 411 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1350 ఓటర్లు మించకుండా చూశామన్నారు. మొత్తం ఓటర్లు 4,51,201 ఉండగా వారిలో పురుషులు 2,27,896 మంది, మహిళలు 2,23,301 మంది, ఇతరులు నలుగురు ఉన్నారన్నారు. ఇప్పటికీ కూడా ఓటరుగా నమోదు చేసుకోని వారు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బే విండో విస్తరణ..

సాక్షి, సిటీబ్యూరో: గృహోపకరణ, గృహాలంకరణ వస్తువులకు పేరొందిన బే విండో బ్రాండ్ మరో 10 నగరాలకు విస్తరించనుంది. ఈ విషయాన్ని సంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాహకులు సిద్ధాంతి, శివానీ ఆనంద్ తెలిపారు. విలాసవంతమైన ఉత్పత్తులకు పేరొందిన ఈ బ్రాండ్ శరవేగంతో వృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో తొలి స్టోర్ ఏర్పాటుకు ఎంచుకుందని అదేవిధంగా ఇకామర్స్ వేదిక కూడా ఏర్పాటు చేశామని వివరించారు.

రాష్ట్రంలో బీజేపీ చాలా బలంగా ఉంది



హబ్సిగూడ: బీజేపీ హబ్సిగూడ డివిజన్ అధ్యక్షులు కక్కిరేని హరీష్ ఆధ్వర్యంలో మంగళవారం హబ్సిగూడలో ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అస్సాం రాష్ట్రం నుంచి లఖిమ్‌పూర్ ఎమ్మెల్యే మనబ్ డేఖ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ చాలా బలంగా ఉందని, రాబోయే ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్, నాయకులు బాలచందర్, చింతోజు శ్రీనివాసచారి, తిండేరు హన్మంతరావు, చెల్లోజు ఎల్లాచారి, చింతకింది ప్రవీణ్, సుమన్‌రావు, సంజయ్‌పటేల్, వెంకన్నగౌడ్, రవీందర్‌రెడ్డి, పర్తియా నాయక్, రవి, శ్రీనివాస్, శివగౌడ్, లక్ష్మణ్, వెంకటేష్, శంకర్‌రావు, సంగప్ప, సోమయ్య, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

బోడుప్పల్‌లో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో మంగళవారం మంత్రి చామకూర మల్లారెడ్డి, మేయర్ సామల బుచ్చిరెడ్డి కలిసి రూ.2 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో రూ.5 కోట్లతో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో వీధి దీపాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. రానున్న మూడు నెలల్లో అన్ని రకాల పనులు చేపట్టేందుకు అధికారులు, పాలకవర్గం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో నగర పాలక సంస్థలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రత్యేక దృష్టితో పాటు మరిన్ని నిధులు పెట్టి అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కార్పొరేటర్లు బొమ్మక్ సుగుణ, డి.మహేశ్వరి, సుమన్ నాయక్, మోదుగు లావణ్యారెడ్డి, కాటపల్లి లతారెడ్డి, పొద్దుటూరి శోభారాణి, పోగుల నర్సింహరెడ్డి, కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కొత్త దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

బండారి లక్ష్మారెడ్డికి ఘన స్వాగతం

ఉప్పల్: చిలుకానగర్ వార్డు కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి ఘన స్వాగతం లభించింది. కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ఆయనకు గజమాల వేసి సత్కరించారు. అనంతరం డివిజన్‌కు సంబంధించిన ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. బీఆర్ఎస్, సీఎం కేసీఆర్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే కాలనీ సంఘాలు ఆదరించాలని కోరారు. అందరం కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకుందామని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండాను ఎగురవేద్దామని తెలిపారు. అనంతరం స్థానికులు కొంత మంది బీఆర్ఎస్‌లో చేరిన వారికి జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



చిలుకానగర్‌లో బీఎల్ఆర్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

మున్సిపల్ కార్మికులకు అండగా ఉంటాం



ఉప్పల్‌లో కార్మికులకు మద్దతు తెలుపుతున్న కందికంటి అశోక్ కుమార్ గౌడ్

కందికంటి అశోక్ కుమార్ గౌడ్

ఉప్పల్: మున్సిపల్ అవుట్ సోర్సింగ్, శానిటేషన్ కార్మికుల పోరాటానికి అండగా ఉంటామని టీడీపీ మల్కాజిగిరి పార్లమెంట్ అధ్యక్షుడు కందికంటి అశోక్ కుమార్ గౌడ్ అన్నారు. మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐదు రోజులుగా చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటిస్తూ మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రోజు రోజుకూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతోందని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో పి.శేఖర్‌రెడ్డి, గిరిబాబు, భిక్షపతి, తిక్క ప్రకాశ్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ మాట తప్పారు..

కాప్రా: జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం బీ–బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి అన్నారు. కాప్రా సర్కిల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులకు వారు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ మాట తప్పారన్నారు. తక్షణమే ఇచ్చిన హామీని నెరవేర్చాలని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు మేడల మల్లికార్జున్‌గౌడ్, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, పత్తి కుమార్, హెచ్ఆర్.మోహన్, సాయిగౌడ్, ప్రేమ్‌కుమార్‌గౌడ్, సతీష్‌గౌడ్, సందీప్‌గౌడ్, బాలరాజుగౌడ్, సాయిగౌడ్, మనోహర్, రాజు, ప్రభాకర్, అజయ్, పవన్, సన్నీగౌడ్, రాజ్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల ధర్నాకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి